క్లుప్తంగా

నేటి నుంచి టీచర్లకు న్యాస్‌పై శిక్షణ

కెరమెరి: నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (జాతీయ సాధన సర్వే) పై నేటి నుంచి రెండు రోజులు ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కెరమెరిలో, గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గోయగాంలో ఉదయం 9.30 గంటల నుంచి శిక్షణ తరగతులు కొనసాగుతాయని, సూచించిన ఉపాధ్యాయులు సకాలంలో శిక్షణా తరగతులకు హాజరు కావాలని సూచించారు.

‘రైతుబీమా చేసుకోండి’


రైతులతో మాట్లాడుతున్న ఏఈవో వెంకటేశ్

కెరమెరి: ఇప్పటివరకు రైతుబీమా చేసుకోని వారు, కొత్తగా పట్టాపాస్‌బుక్ పొందిన వారు ఆగస్టు 5లోపు రైతుబీమా చేసుకోవాలని ఏఈవో వెంకటేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని బాబేఝరి, శివగూడ, చాల్‌బాడి, టోకెన్‌మోవాడ్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో 470 మంది రైతులకు రైతుబీమా రెన్యూవల్ చేశారు.

ఆర్ఎంపీ, పీఎంపీ మండల కమిటీ ఎన్నిక


కమిటీ సభ్యులను సన్మానిస్తున్న వైద్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీ సంఘ కార్యాలయంలో మంగళవారం ఆసిఫాబాద్ మండల స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్ఎంపీ, పీఎంపీ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రవికాంత్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్‌చారి, మల్లేష్, ప్రధాన కార్యదర్శిగా వెంకన్న, సహాయ కార్యదర్శిగా మాజిద్, లింగు శ్రీకాంత్, కోశాధికారిగా బలరాం, సందీప్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు రూప్‌నార్ రమేశ్, మధు, కేదారిగౌడ్, శ్రీనివాస్, సత్తార్, పొన్నాల తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కెరమెరి: కాగజ్‌నగర్‌లోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు మండలంలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మందపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

వాంకిడి: పేకాట ఆడుతూ పట్టుబడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం మండలంలోని చిన్న బెండార గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి వారి వద్ద నుంచి రూ.1240 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేషన్ బియ్యం పట్టివేత

వాంకిడి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆసిఫాబాద్‌కు చెందిన జి.గోపాల్ అనే వ్యక్తి టాటా మ్యాజిక్ వాహనంలో మండలంలోని ఖమాన గ్రామంలో రాయితీ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తున్న క్రమంలో పట్టుకున్నట్లు తెలిపారు. వాహనంతో పాటు పట్టుబడిన 10.50 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి నిందితునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రహదారికి మరమ్మతులు

జైనూర్: జైనూర్ ప్రధాన రహదారిపై ప్రమాదకర గుంతలు ఏర్పడటంతో మండల పోలీసులు మరమ్మతులు చేపట్టారు. ఎస్సై సందీప్‌కుమార్ మాట్లాడుతూ మండల పరిధిలోని పోచంలొద్ది, పలు వంతెనల వద్ద ప్రమాదకర గుంతలు ఏర్పడి నీరు నిల్వ ఉండటంతో ప్రమాదాలు సంభవిస్తాయని రహదారికి మరమ్మతులు చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జైనూర్ సీఐ అంజయ్య, కాంట్రాక్టర్ ఫాజిల్ తదితరులు ఉన్నారు.

రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలి

కెరమెరి: రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని ఎంపీడీవో అంజద్‌పాషా, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య అన్నారు. మంగళవారం మండలంలోని బాబేఝరి గ్రామంలో రైతులతో మాట్లాడారు. హరితహారంలో భాగంగా రైతులు తమ పొలాల్లో, ఖాళీ ఉన్న స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు.

గుట్టపై వరాల తల్లి

- భక్తుల కోర్కెలు తీర్చే కంకలమ్మ దేవి
- పర్యాటక ప్రాంతంగా గుర్తించాలని వినతి
- ఆలయానికి తారురోడ్డు లేక ఇబ్బందులు
- ఆగస్టు 4న బోనాల జాతర


కౌటాలలోని కంకలమ్మ దేవి -శ్రీ కేతేశ్వర స్వామి ఆలయం

కౌటాల: మండల కేంద్రం సమీపంలోని ఎత్తైన గుట్టపై ఉన్న వెలిసిన శ్రీ కేతేశ్వరస్వామి -కంకలమ్మ ఆలయం పర్యాటక శోభను సంతరించుకుంటోంది. కంకలమ్మ ఆలయానికి కుమురంభీం జిల్లాతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వేలాది భక్తులు వచ్చి నిత్యం దర్శించుకుంటారు. ఏటా నిర్వహించే కంకలమ్మ జాతరకు ఆలయానికి వచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఎంతో ప్రాముఖ్యత కలిగిన కంకలమ్మ ఆలయానికి వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గం లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆలయ చరిత్ర..

కంకలమ్మ ఆలయం 11వ శతాబ్దంలో కాకతీయ రెండవ ప్రతాపరుద్రుని ఆధ్వర్యంలో నిర్మాణం జరిగినట్లు స్థానికంగా లభించిన చారిత్రక ఆధారాల ద్వారా తెలుస్తోంది. 11వ శతాబ్దంలో కర్ణాటకలోని కేతేశ్వరుడు అనే శివభక్తుడి తపస్సుకు మెచ్చిన శివుడు కేతేశ్వరుని పేరుతో ఇక్కడ వెలిసినట్లుగా భక్తులు విశ్వసిస్తుంటారు. దక్షిణ భారతదేశంలోనే కేతేశ్వరుడి పేరిట వెలసిన ఏకైక క్షేత్రం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేస్తుంటారు. మేదరి కులస్తుల కుల దైవమైన కంకలమ్మ -కేతేశ్వరులను స్థానికులు గ్రామ దేవతలుగా కొలుస్తుంటారు.

భక్తుల కొంగుబంగారం..

మండల కేంద్రంలో వెలిసిన కంకలమ్మ -శ్రీ కేతేశ్వరులు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. కౌటాల, బెజ్జూర్, సిర్పూర్ మండలాల పరిధిలో కరువు కాటకాలు సంభవించిన కాలంలో భక్తులు ఇక్కడకు వచ్చి పూజలు నిర్వహించేవారు. దీంతో పెద్ద వర్షాలు కురుస్తాయని వారి నమ్మకం. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతీ కార్తికమాసం చివరి ఆదివారం జాతర మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. మహా జాతరకు కుమురం భీం, మంచిర్యాల, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలతో పాటు, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి తమ కులదైవాన్ని కొలిచేందుకు మేదరి కులస్తులతో పాటు భక్తులు అసంఖ్యాకంగా తరలివస్తుంటారు. లేత బొంగులు వచ్చే ఈ కాలంలో మేదరి కులస్తులు ప్రత్యేకంగా పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలి



కంకలమ్మ దేవి మహాత్మ్యం చాలా గొప్పది. మండల కేంద్రం నుంచి గుట్టపై ఉన్న ఆలయానికి వెళ్లేందుకు మొరం రోడ్డు ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై అధ్వానంగా మారింది. అధికారులు స్పందించి ఆలయం వరకు తారు రోడ్డు నిర్మించాలి. **- దశరథం, భక్తుడు, కౌటాల**

పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి



కంకలమ్మ ఆలయానికి టీటీడీ గుర్తింపునిచ్చింది. ఆలయం చుట్టూ అందమైన చెట్లతో వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం గుట్టపై ఉన్న కంకలమ్మ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేయాలి. ఆగస్టు 4న నిర్వహించే బోనాల జాతరలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి.

- సుల్వ కనకయ్య, ఆలయ చైర్మన్

ఆలయానికి రోడ్డేది..?

కంకలమ్మ ఆలయంలో ఆగస్టు 4న ఆషాఢ బోనాల జాతర నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేశంలోనే పేరుగాంచిన కౌటాల కంకలమ్మ దేవి ఆలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని మండల వాసులు పేర్కొంటున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు మెట్లదారిలో కాలినడకన గుట్టపైకి చేరుకోవాల్సి ఉండగా చుట్టూ ఉన్న గుట్టలు, అడవి ప్రకృతి దృశ్యాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. కంకలమ్మ గుట్టపై ఉన్న దేవతల పురాతన విగ్రహాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి.



కంకలమ్మ ఆలయం గుట్టపై ఉండడంతో ఆలయానికి వెళ్లేందుకు మొరం రోడ్డు వేశారు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో మొరం రోడ్డు కోతకు గురైంది. దీంతో భక్తులు ఆలయానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకలమ్మ ఆలయానికి వెళ్లడానికి బీటీ రోడ్డు వేయాలని భక్తులు కోరుతున్నారు.

జిల్లా అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- శాసనసభ సమావేశాల్లో ఎమ్మెల్యే హరీశ్‌బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

బెజ్జూర్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు నిధులు కేటాయించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శాసనసభలో మంగళవారం సాగునీటి రంగం, సివిల్ సప్లయ్‌పై జరిగిన పద్దుల చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఒకవేళ జిల్లాకు నిధులు కేటాయించని పక్షంలో మహారాష్ట్రలో కలిపేయాలని ఆవేదన వెలిబుచ్చారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం శాసనసభ కమిటీ వేయాలని, వెనకబాటుతనంపై అధ్యయనం చేయడంతో పాటు పరిష్కార మార్గాలు చూపించాలని కోరారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.250 కోట్లను కేటాయించిందని, కానీ ప్రాజెక్టు నిర్మాణానికి వేలకోట్లు అవసరం ఉందన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించాలని, కేంద్రం నుంచి 60 శాతం నిధులు తీసుకురావడానికి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నామన్నారు. జగన్నాథ్‌పూర్, అడ ప్రాజెక్టులను పూర్తిచేయాలని, పీపీరావు ప్రాజెక్టు పూడికతీసి 11 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించాలని కోరారు. జిల్లాలో పలు రోడ్ల నిర్మాణం కోసం రూ.12 కోట్ల నిధులు అటవీ శాఖకు చెల్లించాలని కోరారు. ఏటా ప్రాణహిత ఉప్పొంగడంతో వేల ఎకరాల్లో పంట నష్టం జరుగుతున్నా ప్రభుత్వం నష్టపరిహారం అందించకపోవడం బాధాకరమన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

‘భగీరథ’ నీరు సరఫరా చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

కెరమెరి: కొద్దిరోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బందులు పడుతున్నామని, నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని బాబేఝరి గ్రామానికి చెందిన గిరిజనులు కోరారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అంజద్ పాషాకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గడిచిన నెల రోజులుగా భగీరథ నీరు రావడం లేదన్నారు. కుమురంభీం ప్రాజెక్టులో వరద రావడం వల్ల ప్యూరిఫైడ్ చేయలేక నీటిని వదలడం లేదని అధికారులు చెబుతున్నారన్నారు. తాగేందుకు నీరు లేక బావులు, చెలిమెల వద్ద నీరు తెచ్చుకుంటున్నామని పేర్కొన్నారు. స్పందించిన ఎంపీడీవో రెండు రోజుల్లో నీరు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్లయ్య, చిన్ను, సుభాష్, జంగు, తేజు, బాబూసింగ్, పండిత్ తదితరులు ఉన్నారు.

ఏరియా ఆసుపత్రి మెడికల్‌స్టోర్‌ను తెరిపించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి ఏరియా ఆసుపత్రి మెడికల్‌స్టోర్‌ను వెంటనే తెరిపించాలని సింగరేణి ఏరియా ఆసుపత్రి పరిరక్షణ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో ఆసుపత్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఏరియా జీఎం రవిప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గత 25 రోజులుగా మెడికల్ స్టోర్‌ను మూసి ఉంచి ఆసుపత్రికి వచ్చే రోగులకు మందులు ఇవ్వకుండా గోదావరిఖని, రామక్రిష్టాపూర్‌కు రెఫర్ చేస్తున్నారన్నారు. దీంతో రోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. జీఎం ఆదేశాలతోనే మెడికల్ స్టోర్ మూసివేసినట్లు ఆసుపత్రి సిబ్బంది చెబుతున్నారని, సింగరేణి ఏరియా ఆసుపత్రికి పూర్వవైభవం తెచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తూ ఆసుపత్రిని ఎత్తివేసే చర్యలు చేపడితే సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, రాజమౌళి, జయరాం, మణిరాంసింగ్, చాంద్‌పాషా, మహేందర్, పోషమల్లు, ఓజియార్, దేవి సత్యం, రాజాబాబు, ఎస్.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా పాఠశాల ఆవరణ


బోదంపల్లి పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు

కౌటాల: మండలంలోని బోదంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచి పాఠశాల ఆవరణ బురదమయంగా మారింది. కౌటాల -బెజ్జూర్ ప్రధాన రహదారి సమీపంలోనే పాఠశాల ఉండగా రహదారి ఎత్తును పెంచడంతో పాఠశాలలోకి వరదనీరు వచ్చి చేరుతోంది. పాఠశాల ఆవరణ బురదమయంగా మారడంతో విద్యార్థులు తరగతి గదులకు వెళ్లేందుకు నరకయాతన పడుతున్నారు. నీటిలో నుంచి వెళ్లే క్రమంలో విద్యార్థులు బురదలో అదుపుతప్పి జారి పడుతున్నారు. అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఘనంగా బోనాల పండుగ


ఆసిఫాబాద్‌అర్బన్: ఆలయానికి వెళ్తున్న భక్తులు


రెబ్బెన: పూజలు చేస్తున్న విశ్వప్రసాద్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఆషాఢ మాసం పురస్కరించుకొని పట్టణంలోని సందీప్‌నగర్‌లో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. శివసత్తుల నృత్యాలతో డప్పు చప్పుళ్లతో కాలనీ వాసులు అమ్మవారికి భక్తితో బోనాన్ని సమర్పించారు. భక్తులు మాట్లాడుతూ బాగా వర్షాలు కురిసి పంటలు పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో శివసత్తులు రవి, కీర్తి, రేణుక, సిరికొండ నీల, పోశక్క, ఎన్న పుష్ప, రాపర్తి చిలుకమ్మ, అమ్మక్క పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో మంగళవారం భక్తులు అమ్మవారికి ఆషాఢ పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు, పట్టు వస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి మేకలు బలిచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

ఇందిరానగర్ సమీపంలో గల దారి మైసమ్మ తల్లి బోనాల జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం నుంచి అమ్మవారి ఆలయం వరకు భక్తులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. శివసత్తుల పూనకాలు, డప్పు వాయిద్యాల నడుమ భక్తులు అమ్మవారి బోనాలను తలపై పెట్టుకుని ఆలయానికి తరలివెళ్లారు. బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు, మాజీ ఎంపీపీ సౌందర్య, మాజీ సర్పంచ్ అహల్యాదేవి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

భోజనం పంపిణీ

ఆసిఫాబాద్: లయన్స్ క్లబ్ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ గట్టమనేని బాబురావు జన్మదినం పురస్కరించుకొని క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు ఉబేద్‌బిన్ యాహియా, ప్రతినిధులు నాంపెల్లి శంకర్, వేణుగోపాల్, రమణారెడ్డి, కోట వెంకన్న, రావుల వినాయక్, పుల్లూరి శంకర్, మల్లేశ్ పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు

సిర్పూర్(టి): మండలంలో గత పదిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలోని కొత్తకాలనీలోని ఉపాసి లక్ష్మీబాయి అనే మహిళ ఇల్లు మంగళవారం కూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న సామగ్రి చెడిపోయాయి. ఇంటి పైకప్పు కూలిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

రైతులు వరి నాట్లు వేయాలి

కౌటాల: మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని రైతులు వరినాట్లు వేయాలని కౌటాల ఏఈవో ఘన్‌శ్యాం అన్నారు. మంగళవారం కౌటాల రైతు వేదికభవనంలో రైతునేస్తం కార్యక్రమాన్ని రైతులు వీక్షించారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట సాగులో చేపట్టాల్సిన పద్ధతులను వివరించారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించి పంటలకు మందులు పిచికారీ చేయాలని సూచించారు.

‘హామీలు అమలు చేయాలి’

ఆసిఫాబాద్‌అర్బన్: ఎన్నికల ముందు కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సివిల్ సప్లై జిల్లా అధికారి కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ హమాలీ కార్మికులకు నూతన రేట్లు క్వింటాల్‌కు రూ.40 అమలు చేయాలని ఏడు నెలలుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద బుధవారం నిర్వహించే ధర్నాలో జిల్లాలోని సివిల్ సప్లై హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దివాకర్, సుధాకర్, రాజన్న, దత్తు, మోహన్, నవీన్ పాల్గొన్నారు.

గ్రామీణ నూతన ఆవిష్కరణలపై శిక్షణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్: ఇంటింటా గ్రామీణ నూతన ఆవిష్కరణలపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామీణ నూతన ఆవిష్కరణలపై పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీడీవో రమేశ్ మాట్లాడుతూ జీవన ప్రమాణం, ఆర్థికాభివృద్ధి, స్థిరత్వాన్ని మెరుగుపర్చడంపై ఈ ఆవిష్కరణలు దృష్టి పెడతాయన్నారు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక శక్తి, చిన్నతరహా పరిశ్రమలలో పురోగతిని ఆవిష్కరణలు కలిగి ఉంటాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్నోవేషన్ కోఆర్డినేటర్ కిరణ్ గైక్వాడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు సన్మానం

వాంకిడి: మండల తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రియాజ్‌అలీని మండల రేషన్ డీలర్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు జయంత్ కుమార్, యశ్వంత్‌రావు, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: రెబ్బెన నూతన తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రామ్మోహన్‌రావును మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించారు. నాయకులు లావుడ్య పల్లాస్, దుర్గం రవీందర్, జిల్లాల స్వామి, పూదరి సాయి, సాయికుమార్, బాలు నాయక్, రహీం తదితరులు పాల్గొన్నారు.

‘అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు’

కాగజ్‌నగర్‌రూరల్: ఆశా వర్కర్ల హక్కుల కోసం చలోహైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లనీయకుండా అక్రమంగా అరెస్టు చేశారని, అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సీపీఎం నియోజకవర్గ ఇన్‌చార్జి ముంజం ఆనంద్‌కుమార్ అన్నారు. విలేకర్లతో మాట్లాడుతూ అక్రమ అరెస్టులు చేయడం కాంగ్రెస్ పార్టీకి సిగ్గు చేటన్నారు. గత ప్రభుత్వం కూడా నిర్బంధాలు విధించడంతోనే ప్రజలు బుద్ధిచెప్పారన్నారు. సమస్యలను పరిష్కరించాలని లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

రెబ్బెన: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో నడిచి సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండలంలోని సోనాపూర్ గిరిజన గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులు, యువతతో మాట్లాడారు. గుట్కా, గంజాయి, జూదం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. యువకులకు వాలీబాల్ కిట్ అందజేశారు.

విద్యార్థులకు అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: నూతన చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, తదితర అంశాలపై మంగళవారం మండలంలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై సోనియా మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

‘చలో ఢిల్లీ’ విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఎస్సీ వర్గీకరణ చేపట్టాలనే డిమాండ్‌తో ఆగస్టు 6న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రవి పిలుపునిచ్చారు. దీక్షకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే దీక్షలకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నరేశ్, హరీశ్, పవన్, యూసుఫ్, హైమద్, శేఖర్, పాల్గొన్నారు.

గండి పూడ్చరూ..!


మునిగిన పత్తి పంట

తిర్యాణి: మండలంలోని ఎన్టీఆర్‌సాగర్ (చెలిమల) వాగు ప్రాజెక్టుకు సంబంధించిన కాలువకు రాళ్లకన్నెపెల్లి గ్రామ శివారులో గండి పడటంతో పంటలు నీట మునిగాయి. ఎక్కువ రోజులు పత్తి పంటలో నీరు నిల్వ ఉంటే మొక్కలు ఎర్రబడి చనిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కాలువకు పడిన గండిని పూడ్చాలని బాధిత రైతులు కోరుతున్నారు.